

'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న వరద తగ్గింది. గురువారం 15,425 క్యూసెక్కులు రాగా డ్యాంలో 72.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నెల్లూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెయ్యి కిలోల వివిధ రకాల స్వీట్లతో మూలవర్లకు ప్రత్యేక అలంకారం



నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మధుకైటభ వధ అలంకరణలో కామాక్షితాయి

జయ జయ హే జగజ్జననీ!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వేడుకగా జరుగుతున్నాయి. వివిధ అలంకరణలలో కొలువుదీరుతున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటున్నారు. అభిషేకాలు, అర్చనలు, నవావరణ పూజలు, చండీ హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, సహస్ర దీపాలంకరణలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.

నెల్లూరులోని ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరిని వెయ్యి కిలోల స్వీట్లతో అలంకరించారు. రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాలతోపాటు జొన్నవాడ, రాపూరు, కావలి, సంగం, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.




రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పారదర్శకంగా ఓటర్ల

జాబితా నవీకరణ

● కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల వారు నూతన ఓటర్లకు అవగాహన కల్పించాలని, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రాలు పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలని కోరారు. బూత్ లెవల్ ఏజెంట్లను రాజకీయ పార్టీల వారు నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి వెంకట శేషయ్య, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు.





ప్రభుత్వం ఏదైనా

నా పంథా ఇదే!

● గృహ నిర్మాణశాఖలో ఆ అధికారి తీరేవేరు ● వైసీపీ హయాంలో చక్రం తిప్పిన ఆఫీసర్
● ప్రస్తుత ప్రభుత్వంలోనూ అనేక ఆరోపణలు ● విజిలెన్స్ విచారణలో బట్టబయలు
● రాష్ట్ర అధికారుల విచారణకూ డుమ్మా ● పక్క జిల్లాకు వెళ్లినా మారని తీరు

ప్రభుత్వం మారింది.. విధానాలూ మారాయి.. కానీ ఆ అధికారి తీరు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో జిల్లాలో హౌసింగ్ శాఖను భ్రష్టు పట్టించారన్న అపవాదును మూటగట్టుకున్న సదరు అధికారి.. ఇప్పుడూ అదే పంథాలో నడుస్తుండటం ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలోనే కాదు.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఆ హౌసింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. అంతేగాక సీఎంతోపాటు ఇతర ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు అందాయి. కానీ తనకున్న పలుకుబడితో తనపై చర్యలు తీసుకోకుండా ఆ అధికారి అడ్డుకుంటూ వచ్చారన్న ఆరోపణలున్నాయి. హౌసింగ్ శాఖలోని కొందరు ఉన్నత స్థాయి అధికారులు ఈ అధికారికి అండగా ఉంటున్నారన్న ప్రచారముంది.

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఈ అధికారి అవినీతిని ఎత్తిచూపుతుండటంతో పరిస్థితులు మారాయి. గతంలో నెల్లూరులో పనిచేసిన సమయంలో ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులు, విజిలెన్స్ నివేదికల నేపథ్యంలో రాష్ట్ర హౌసింగ్ అధికారులు ఇటీవల విచారణకు నెల్లూరు వచ్చారు. పక్క జిల్లాలో పనిచేస్తున్న సదరు అధికారికి విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు పంపారు. అయితే, సదరు అధికారి రెండు రోజులపాటు విచారణకు రాకుండా డుమ్మా కొట్టారు. విచారణకు హాజరైతే నేరుగా వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుందని, అప్పుడు తనపై చర్యలు తీసుకునేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందని సదరు అధికారి భావించినట్లు హౌసింగ్ శాఖలో గుసగుసలాడుకుంటున్నారు. అయితే విచారణాధికారులు కూడా తెలివిగా వ్యవహరించి నేరుగా పక్క జిల్లాలో సదరు అధికారి పనిచేస్తున్న చోటకు వెళ్లి విచారించారు. ఈ వ్యవహారం ఇప్పుడు హౌసింగ్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అయితే తనను ఎవరూ ఏమీ చేయలేరని బహిరంగంగానే చెప్పుకుంటున్నట్లు ఆ శాఖ ఉద్యోగ వర్గాలు మాట్లాడుకుంటుండటం కొసమెరుపు.

● చర్యలకు బదులు ప్రమోషన్

వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో పనిచేసే సమయంలో సదరు హౌసింగ్ అధికారిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. సిమెంటు, స్టీలు మాయం చేయడమేగాక తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించారన్న అభియోగాలు ఉన్నాయి. ఆ సమయంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఓ గోదామును తనిఖీ చేసి రూ.1.53 కోట్ల విలువైన సిమెంటు, స్టీలు మాయమైందని, అందుకు బాధ్యుడిగా ఈ అధికారిపై కూడా చర్యలకు సిఫార్సు చేశారు. అయితే ఈ అధికారిపై విచారణలు పెండింగ్ ఉన్నప్పటికీ గతేడాది ప్రమోషన్ ఇచ్చి మరీ జిల్లా స్థాయి పోస్టులో కూర్చోబెట్టారు. ఇప్పుడు కూడా ఆ జిల్లాలో సదరు అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా జిల్లా నుంచి బదిలీ అయి వెళ్లినా గతంలో చేసిన తప్పులు బయటకు రానీయకుండా ఉండేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దసరాకు ఊరెళుతున్నారా...

దొంగలతో జాగ్రత్త!

● 'ఎల్‌హెచ్ఎంఎస్' ఇంటికి రక్ష

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు కుటుంబ సభ్యులతో కలసి సొంతూర్లకు, యాత్రలకు వెళుతున్నారా?... అయితే మీ ఇంట్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి!. ఏటా పండుగ సంతోషంలో ప్రజలుంటే దొంగలు తాళం వేసిన ఇళ్లను దోచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచడం మంచిదని సూచిస్తున్నారు.

ఎల్‌హెచ్.ఎంఎస్‌తో ప్రయోజనం

ఇళ్లకు తాళాలు వేసుకొని ఊర్లకు వెళ్లే ప్రజలు పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్) సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని పోలీసులు చెబుతున్నారు.

- స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి.
- మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది.
- ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎల్‌హెచ్ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది.
- ఊరికి వెళ్లే ముందు ఈ యాప్‌లో రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన, ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు వస్తారు అన్న వివరాలు పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆక్రమణలు తొలగేనా.. కాలువలు బాగుపడేనా!?

- రూ.47 కోట్లతో కాలువల అభివృద్ధికి టెండర్లు
- పది రోజుల్లో పూర్తి చేయనున్న ఇరిగేషన్ శాఖ
- ఆక్రమణలు తొలగించాలంటూ కమిషనర్‌కు లేఖ

6 లో..

మళ్లీ 'మాతృ వందనం' అమలు

● గర్భిణులు, బాలింతలకు లబ్ధి
● రూ.11 వేల వరకు ఆర్థిక సాయం

సంగం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకర ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)ను 2017లో ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆర్థికసాయం అందించేది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలులో నిర్లక్ష్యం చేసింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను వివిధ కార్పొరేషన్లకు మళ్లించడంతో అసలు ఈ పథకం ఉన్నట్లు దాదాపు ప్రజలు మరచిపోయారు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ మాతృ వందనం పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. గతంలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షిస్తున్న ఈ పథకాన్ని ఇప్పుడు మహిళా శిశు సంక్షేమ శాఖకు బదలాయించారు.

● తల్లుల ఖాతాల్లోకి..

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మినీ, ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 2,934 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు సుమారు 15 వేల మంది, బాలింతలు 12 వేల మంది ఉన్నారు. వీరందరికీ మాతృవందనం పథకం ద్వారా రూ. 11వేల వరకు సాయం అందిస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక లాగిన్ కేటాయించారు. అందులో లబ్ధిదారుల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అర్హులు. గర్భం దాల్చిన తరువాత రూ.1000 ఇస్తారు. ప్రసవం అనంతరం రూ. 2వేలు, ఏడాదిలో బిడ్డకు టీకాలు పూర్తయిన తరువాత మరో రూ.2వేలు నేరుగా లబ్ధిదారు ఖాతా జమవుతుంది. ఇక రెండో కాన్పులో ఆడపిల్ల జన్మిస్తే రూ. 2వేల చొప్పున మూడు విడతల్లో జమవుతుంది. రెండు కాన్పులకు కలిపి మొత్తం రూ.11వేలు అందుతుంది. ఈ పథకం వల్ల పేద గర్భిణులు పోషకాహారంతో పాటు చంటి బిడ్డలకు సకాలంలో టీకాలు వేయించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



6 లో..

మెరిసిన తారలు..

ముసిసిన నవ్వులు

నెల్లూరులో వారాహి సిల్క్స్ షోరూం గురువారం నెల్లూరులో ఘనంగా ప్రారంభమైంది. సినీ నటి మీనాక్షి చౌదరి, నటి, యాంకర్ సుమ కనకాల హాజరై అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా అందరితో కలిసి నవ్వులు పూయించారు.

ఉయ్యాలపల్లిలో బుధవారం అదృశ్యమైన ఇద్దరు చిన్నారులు కన్నవారిలో తీవ్ర శోకాన్ని మిగిల్చారు. ఏ చెరువు వారు వారు కనిపించకుండా పోయారో... అదే చెరువులో గురువారం శవాలుగా తేలారు. బిడ్డల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



బాలుర మృతదేహాలను చూసి రోదిస్తున్న కుటుంబ సభ్యులు



నీటి గుంతలో నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

తీరని పుత్రశోకం

● అదృశ్యమైన చిన్నారుల విషాదాంతం ● చెరువుకుంటలో పడి మృత్యువాత ● ఉయ్యాలపల్లిలో విషాదఛాయలు ● గుండెలవిసేలా రోదించిన బంధువులు

కలువాయి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన నూటేటి విష్ణువర్ధన్ (9), మనుబోటి నవశ్రావణ్ (12) దసరా సెలవులు కావడంతో బుధవారం ఇంటి వద్ద ఆడుకుంటున్నారు. కాగా గ్రామ చెరువులో నుంచి ఉయ్యాలపల్లికి టిప్పర్లతో మట్టి తోలుతున్నారు. అందులో ఓ టిప్పరుకు నవశ్రావణ్ తండ్రి నరసింహులు డ్రైవర్‌గా ఉన్నాడు. ఆడుకుంటున్న నవశ్రావణ్, విష్ణువర్ధన్‌ను నరసింహులు తన టిప్పరులో ఎక్కించుకుని చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వారిని దించి, ఇంటికి వెళ్లండని చెప్పగా, వారు బయలుదేరారు. అయితే సాయంత్రానికి కూడా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు సమీపంలోని కాలువలు, అటవీ ప్రాంతంలో రాత్రి పొద్దుపోయే వరకు గాలించారు. ఎలాంటి ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా గురువారం ఉదయం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సంగం సీఐ వేమారెడ్డి, చేజర్ల, రాపూరు, సైదాపురం, మర్రిపాడు ఎస్‌ఐలు తిరుమలరావు, రాజేష్, క్రాంతికుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు డ్రోన్ కెమెరాలు, జాగిలాల సాయంతో ఉయ్యాలపల్లి పరిసరాలను మధ్యాహ్నం వరకు జల్లెడ పట్టారు. మధ్యాహ్న సమయంలో గొర్రెల మంద ఒకటి చెరువులోని గుంటలో నీళ్లు తాగేందుకు వెళ్లి బెదిరిపోయాయి. ఇది గమనించిన గొర్రెల కాపరి గుంటవద్దకు వెళ్లి చూడగా, అందులో ఓ బాలుడి శవం తేలుతూ కనిపించింది. ఈ విషయాన్ని ఆ గొర్రెలకాపరి పోలీసులకు, గ్రామస్థులకు తెలియచేశాడు. దీంతో పోలీసులు గుంట వద్దకు వచ్చి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బుధవారం ఉదయం ఆడుతూపాడుతూ కనిపించిన బాలురు గురువారం విగతజీవులుగా మారడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు.

● చివరిచూపు కోసం గల్ఫ్ నుంచి...

నూటేటి ప్రసాద్-లక్ష్మమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. వీరిలో విష్ణువర్ధన్ చివరివాడు. కలువాయిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ప్రసాద్ బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. బుధవారం కుమారుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన గల్ఫ్ నుంచి బయలు దేరి గురువారం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి చేరుకునేలోపు కుమారుడు ఇక లేడన్న వార్త తెలుసుకుని కన్నీరు మున్నీరయ్యాడు.

● నేనే చంపుకున్నా..

మనుబోటి నరసింహులు- సుశీల దంపతులకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు నవశ్రావణ్. ఉయ్యాలపల్లిలోనే ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. నరసింహులు ఇంటి వద్దే వ్యవసాయం చేసుకుంటూ, పనులు లేనప్పుడు టిప్పరు డ్రైవరుగా వెళుతుంటారు. నవశ్రావణ్ మృతదేహాన్ని చూస్తూ తానే చెరువు వద్దకు కుమారుడిని తీసుకెళ్లానని, ఇలా జరుగుతుందని ఊహించలేదని నరసింహులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.



దాసరిపల్లిలో చెట్ల కింద రాలిన బత్తాయి కాయలు

నేలరాలిన ఆశలు!

- దసరాలో బత్తాయి రైతుకు నిరాశ
- పెరగని ధర..
- ఎకరాకు రూ.50వేల వరకు నష్టం

ఉదయగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దసరా సీజన్ అంటే బత్తాయి రైతులకు ఎనలేని ఆనందం. ఎందుకంటే అప్పుడే ధరలు పెరుగుతాయి. కానీ ఈసారి వారి ఆశలు ఆడియాశలు అయ్యాయి. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాయల నాణ్యతను బట్టి టన్ను రూ.15 వేల నుంచి 20 వేలు పలుకుతోంది. ధరల కోసం ఎదురుచూస్తూ దిగుబడులను చెట్ల మీద ఉంచడంతో అవి రంగు మారి టన్నుల కొద్దీ చెట్ల నుంచి నేలరాలుతున్నాయి. ఫలితంగా సాగుదారులు భారీగా నష్టపోతున్నారు. జిల్లాలో సుమారు పది వేల ఎకరాల్లో బత్తాయి సాగులో ఉండగా, కొంతమంది రైతులు వచ్చినకాడికి చాలని పంట విక్రయించగా మరి కొంతమంది చెట్లపైనే కాయలను ఉంచడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరాకు 6 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది. ఎరువుల వినియోగాన్ని బట్టి చెట్టుకు 60 నుంచి 80 కిలోల దిగుబడి చేతికందుతుంది. బత్తాయి పంట కాలం కాయ నుంచి పక్వానికి వచ్చే సమయం 9 నెలలు. గిట్టుబాటు ధరలేదని రైతులు 11 నెలలు గడుస్తున్నా చెట్ల మీదనే ఉంచడంతో టన్నుల లెక్కన నేలరాలుతున్నాయి. ఎకరా సాగులో 2 నుంచి 3 టన్నుల దిగుబడులు నేలరాలుతుండగా, రూ.50 వేలు చొప్పున నష్టం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బత్తాయికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100) : 550

ఫార్మసిస్ట్‌ల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నారాయణ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నగరంలో ప్రదర్శన జరిగింది. ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా బోసు బొమ్మ నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం ఫార్మసిస్ట్‌లు మానవ హారంగా ఏర్పడి ఫార్మసిస్ట్‌ల ఆవశ్యకతను తెలియచేశారు. ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఔషధ శాస్త్రవేత్తల ప్రాధాన్యతను సమాజానికి తెలియచేయాలన్నారు. వ్యాధుల నివారణలో ఫార్మసిస్ట్‌ల కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళా శాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





సౌత్‌రాజుపాళెంలో పోషణ మహోత్సవాలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 12వ డివిజన్ సౌత్‌రాజుపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాలను ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. సూపర్ వైజర్ వీ శకుంతలమ్మ పాల్గొని ఆరోగ్య పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఊబకాయంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గాయకుడు ఎస్పీబీకి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతిని నగరంలోని ఆదిత్య నగర్‌లో గల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో గురువారం నిర్వహించారు. వాకర్స్, యోగా సభ్యులు, పార్కు సిబ్బంది ఎస్పీబీ విగ్రహానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. సతీష్, రాజశేఖర్, కుమార్, ప్రసాద్, రవీంద్ర, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

వాకర్స్ అన్నప్రసాద వితరణ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వాసుపత్రిలోని శ్రీసత్యసాయి సేవాట్రస్ట్‌లో అన్నప్రసాద వితరణ జరిగింది. అసోసియేషన్ సభ్యుడు దేవిశెట్టి సుబ్రహ్మణ్యం కుమారుడు ఫణీంద్ర జ్ఞాపకార్థం ఆసుపత్రిలోని రోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేసినట్లు వాకర్స్ సంఘం అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నం రవిచంద్ర, రాఘవేంద్రశెట్టి, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ స్తూపం ఏర్పాటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద పండిట్ దీన్‌దయాళ్ స్తూపాన్ని గురువారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేశారు. మిడతల రమేష్, రాజేశ్వరి, నాగేంద్ర సింగ్, మురగ నరేష్, ఏవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

















అమరావతికి తరలిన డీస్సీ అభ్యర్థులు

వెంకటాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ - 2025 లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు గురువారం ఉదయం అమరావతికి తరలి వెళ్లారు. మండలంలోని గొలగమూడి గ్రామానికి బుధవారం రాత్రే అభ్యర్థులు చేరుకోగా, ఇక్కడే బస చేశారు. ఉదయాన్నే 788 మంది తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్సుల్లో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బస్సులను సర్వశిక్ష అభియాన్ అదనపు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఇతర అధికారులతో కలిసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న అధికారులు

పచ్చని పల్లెల్లో వైసీపీ మంటలు : బద్దిపూడి గంగమ్మ జాతరలో ఆ పార్టీ లొల్లి

ఉలవపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దిపూడిలో గంగమ్మ జాతర పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నేతలు కట్రలు పన్నుతున్నారు. గ్రామంలో ఈనెల 27న గంగమ్మ జాతర జరగనున్నది. ఇతర కులాలతో పనిలేకుండా వైసీపీ సామాజికవర్గానికి చెందిన 14 మంది కమిటీని ఎన్నుకున్నారు. గంగమ్మ జాతరకు ఇంటికి ఒక తలకి రూ.600 ఇవ్వాలని హుకుం జారీ చేశారు. అనంతరం బలవంతపు వసూళ్లు పాల్పడుతున్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరలో ఏనాడూ పోకడలు లేవు. గ్రామపెద్దలు, గ్రామస్థుల సమక్షంలో భూమి దామాషాన ఎకరాకి రూ.1000 లెక్కన వసూళ్లు చేస్తామని గ్రామపెద్దలు చెప్తున్నారు. బడుగు బలహీన వర్గాలను నుంచి ఏనాడు బలవంతపు వసూళ్లు చేయలేదని గ్రామపెద్దలు గురువారం జరిపిన సమావేశంలో పేర్కొన్నారు. కాగా రాబోవు పంచాయతీ ఎన్నికల సమయానికి ఏదో విధంగా గ్రామంలో గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు పని చేస్తున్నారని గ్రామపెద్దలు ఆరోపించారు. ఇందుకు గంగమ్మ జాతరను పావుగా వాడుకోవాలని చూస్తున్నారు. అయితే ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని గ్రామపెద్దలు చెప్పారు. గ్రామంలోని అన్ని కులాల పెద్దలను కలుపుకొని వారి సూచనల మేరకు జాతరను ఏతేదీన జరుపుతామో నిర్ణయిస్తామని వారు పేర్కొన్నారు

● జాతరకు ఎలాంటి అనుమతులు లేవు..

ఈనెల 27న బద్దిపూడిలో నిర్వహించాలనుకున్న గంగమ్మ జాతరకు శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి అనుమతులు లేవని ఎస్సై అంకమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇరువర్గాల అభిప్రాయ భేదాలతో గొడవలు జరిగే వాతావరణం ఉన్నందున, గ్రామస్థులంతా ఒకమాటపై నిలబడి జాతర జరుపుకోవాలని ఆయన తెలిపారు.

దేవీ వైభవం



రాపూరు : ధైర్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి



నెల్లూరు రూరల్ : వేదగిరిపై గజ లక్ష్మి అలంకరణలో అమ్మవారు



సంగంలో కాత్యాయినిదేవి అలంకరణలో శ్రీకామాక్షిదేవి



నెల్లూరు నగరంలో భవానీ అలంకారంలో ఇరుకళల పరమేశ్వరి



నెల్లూరు నగరంలో అన్నపూర్ణగా శ్రీరాజరాజేశ్వరి



కావలి : మహాగౌరీ అలంకారంలో కలుగోళశాంభవి

మాతా అన్నపూర్ణేశ్వరీ!

● భక్తులతో ఆలయాలు కిటకిట

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపా వెంకట్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు కూడా అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రకరకాల స్వీట్లతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. కాగా, జిల్లాలోని ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విశేష రూపాల్లో అమ్మవార్లు కొలువుదీరుతున్నారు. అభిషేకాలు, అర్చనలు, నవావరణ పూజలు, చండీ హోమాలు, సాముహిక కుంకుమపూజలలో పాల్గొనే భక్తులతో ప్రధాన ఆలయాలు కిటకిటలాడుతున్నాయి.



నెల్లూరులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అదానీ పోర్టులో తొలీగా రాక్ ఫాస్పేట్ రవాణా

ముత్తుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సరుకు రవాణాను మరింత బలోపేతం చేస్తూ ఏకేపీఎల్ సెప్టెంబరు 2025లో తొలిసారిగా రాక్ ఫాస్పేట్‌ను విజయవంతంగా రవాణా చేసింది. కొత్త కస్టమర్ బ్లూ ఫాస్పేట్ లిమిటెడ్, కడప జిల్లాలోని తన ప్లాంట్ కోసం ఎంవీ గ్లామర్ నౌకలో 13,100 మెట్రిక్ టన్నులను తీసుకువచ్చింది. ఈ సందర్భంగా గురువారం అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు సామర్థ్యం, సేవల వల్ల బ్లూ ఫాస్పేట్ లిమిటెడ్ భవిష్యత్తులో రాక్ ఫాస్పేట్ సరుకులన్నింటినీ తమ పోర్టు ద్వారా రవాణా చేయనుందని తెలిపారు. మార్కెట్ మ్యాపింగ్ ద్వారా అవకాశాలను గుర్తించడంలో ముడి పదార్థాల అవసరాలకు ఓడరేవును ఇష్టపడే పోర్టుగా ఉంచడంలో ఏకేపీఎల్ మార్కెటింగ్ బృందం సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు. అదానీ పోర్టు అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్) ద్వారా అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ (ఏకేపీఎల్) సెప్టెంబరు 2025లో రెండు ముఖ్యమైన కార్యాచరణ మైలురాళ్లను నెలకొల్పిందన్నారు. అత్యధిక డిశ్చార్జ్ రేటు, కొత్త సరుకు రవాణా అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ ద్వారా జరగడం శుభపరిణామమన్నారు.



దర్గా వద్ద పిచ్చిమొక్కను పీకుతున్న కలెక్టర్

వారంలో ఒక్క గంట పరిసరాలు శుభ్రం చేసుకుందాం!

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు వారంలో ఒక్కరోజు ఒక్కగంట తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసుకునేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద చెత్త తీసి, పిచ్చిమొక్కలను తొలగించే పనుల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛభారత్ నినాద స్ఫూర్తి ప్రతీ ఒక్కరిలో రావాలన్నారు. మన ఇంటితోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటేనే 'స్వచ్ఛభారత్' లక్ష్యం సాకారమవుతుంద న్నారు. దర్గా ప్రాంతంలో పరిశుభ్రతపై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో కమిషనర్ నందన్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ తన కార్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించి సోలార్ పవర్ వినియోగంపై ఆరా తీశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక నెల్లూరులో ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వనంతోపులో రవికుమార్‌రెడ్డి(40) నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రవికుమార్ ఓ కంపెనీకి చెందిన ఫ్యాన్లు, కూలర్ల డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మానసికంగా కుంగిపోయారు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో మనస్థాపానికి గురై ఈ నెల 23వ తేదీ రాత్రి మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సోమవారం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందారు. రవికుమార్ భార్య నిర్మల గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

నేటి నుంచి రెండో దశ అడ్మిషన్లు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ రెండోదశ అడ్మిషన్లు ఈనెల 26 నుంచి 29 వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగేనా..కాలువలు బాగుపడేనా!?

● రూ.47 కోట్లతో కాలువల అభివృద్ధికి టెండర్లు ● ఆక్రమణలు తొలగించాలంటూ కమిషనర్‌కు లేఖ

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ఎటు చూసినా కాలువల ఆక్రమణకు గురవుతున్నాయి. ఒకప్పుడు పంట కాలువలుగా వీటిని కాలానుగుణంగా డ్రైనేజీ కాలువలుగా ఉపయోగించాల్సి ఉండగా, వాటిలో చాలా వరకూ ఆక్రమణలకు గురయ్యాయి. పది మీటర్ల వెడల్పు ఉండాల్సిన కాలువలు నేడు రెండు, మూడు మీటర్లకు కుదించుకుపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్లపై నిలిచిపోతుండడానికి ప్రధాన కారణం ఈ కాలువల ఆక్రమణేనని గతంలోనే నిపుణులు తేల్చారు. అయితే ఈ కాలువల ఆక్రమణల తొలగింపులో రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో నెల్లూరు నగరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగర నియోజకవర్గంలోని కాలువలను ఆధునికీకరించి, డ్రైనేజీ సమస్య లేకుండా చేసేందుకు ఇరిగేషన్ శాఖ ద్వారా ప్రణాళికలు రూపొందించారు.

● రూ.170 కోట్లతో అంచనా

నెల్లూరు సిటీ పరిధిలో దాదాపు రూ.170 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఈ క్రమంలో రూ.50 కోట్లతో ఇరిగేషన్ శాఖ పనులు చేసేలా ప్రతిపాదించగా, మరో 62 కోట్లతో పబ్లిక్ హెల్త్ విభాగం పనులు చేసేలా నిర్ణయించారు. ఇరిగేషన్ శాఖకు ప్రతిపాదనలు వెళ్లగా రూ.47.83 కోట్లతో అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జూలైలో ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 12 కాలువలను ఐదు కిలోమీటర్ల మేర లైనింగ్ చేసేలా నిర్ణయించారు. ఇందుకు సంబంధించి టెండర్లు పిలవగా, రెండు కాంట్రాక్టు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. మరో పది రోజుల్లో ఈ టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఆ వెంటనే పనులు ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈలోపు కాలువలపై ఆక్రమణలు తొలగుతాయా!? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశానాయక్ మున్సిపల్ కమిషనర్‌కు వైవో నందన్‌కు ఇటీవల లేఖ రాశారు. ఈ మేరకు మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో గుర్తించాయి. ఇప్పుడు ఈ ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చేలా మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే ఈ సారైనా ఆక్రమణలు తొలగించి కాలువలను బాగు చేస్తారా? లేదా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనక్కు తగ్గుతారా? అన్నది వేచి చూడాలి.



నెల్లూరు నగరం మనుమసిద్ధి నగర్‌లో పారుదలకు నోచని కాలువ

టెండర్లు పిలిచాం..

దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా కాలువ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామని, ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశామని వివరించారు.

నెల్లూరులో వేడుకగా వారాహి సిల్క్స్ ప్రారంభం

● తరలివచ్చిన నటీమణులు మీనాక్షి చౌదరి, సుమ కనకాల ● ఇతర ప్రముఖుల హాజరు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాల సందడిలో జిల్లావాసులకు సరికొత్త వస్త్ర ప్రపంచం వారాహి సిల్క్స్ షోరూం గురువారం నెల్లూరులో ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఈ షోరూమ్‌ను సినీ నటి మీనాక్షిచౌదరి, నటి, యాంకర్ సుమ కనకాల, వారాహి సిల్క్స్ మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ ఏచూరి, డాక్టర్ స్పందన మద్దుల ప్రారంభించారు. నటీమణులను చూసేందుకు భారీగా అభిమానులు తరలిరావడంతో మినీబైపాస్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. ప్రేక్షకులకు అభివాదం చేసిన నటీమణులు వారితో కాసేపు సంభాషించారు. వారాహి సిల్క్స్‌ను ప్రారంభించిన వారు అన్ని ఫ్లోర్లను కలియదిరిగారు. పట్టు చీరలను ప్రదర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాబోయే దసరా, దీపావళి, వివాహాది వేడుకలకు అన్ని రకాల పట్టు వస్త్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.500 నుంచి 10లక్షల విలువ చేసే పట్టు వస్త్రాలు ఉన్నట్టు చెప్పారు. వారాహి సిల్క్స్ మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ ఏచూరి, డాక్టర్ స్పందన మద్దుల మాట్లాడుతూ మా షోరూమ్‌లో వస్త్రాలు కొనుగోలు చేసేవారికి అతిథి సత్కారం ఉంటుందన్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రతి రూ.10వేలకు కొనుగోలపై 100 మిల్లీగ్రాముల 22 కారెట్ల బంగారు నాణెం ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్ అక్టోబరు 5వతేదీ వరకు ఉంటుందని పట్టు, కాటన్ చీరలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా నిరంజన్‌రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేగు.షణ్ముఖరావు, భవనాపి సురేష్‌బాబు, దర్శి హరికృష్ణ, షేక్.ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



వారాహి సిల్క్స్ ప్రారంభిస్తున్న నటీమణులు మీనాక్షి చౌదరి, సుమ కనకాల, షోరూం అధినేతలు మణిదీప్ ఏచూరి, స్పందన

ఒక్క రోజైనా జైల్లో పెట్టాలని వేధించారు!

● కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

కావలి (టౌన్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కేసులు పెట్టి, ఒక్కరోజైనా జైల్లో పెట్టాలని వేధించారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫిర్యాదుమేరకు మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదైన విషయం విదితమే. పోలీసుల అరెస్ట్ నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్లిన ప్రతాప్ ఎట్టకేలకు ముందస్తు బెయిల్ తెచ్చుకుని 32 రోజుల తరువాత గురువారం కావలికి చేరుకున్నారు. తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం విలేకరులతో ప్రతాప్ మాట్లాడారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డిపై తాను అవినీతి ఆరోపణలు చేశాననే కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. చిన్న స్క్రీన్‌లో అవినీతి ఆధారాలు చూపిస్తేనే ఉలిక్కి పడ్డారని, త్వరలో తన కల్యాణమండపంలో అన్ని వ్యవహారాలపై సినిమా స్కోప్‌లో చూపిస్తానన్నారు. తనకు చట్టంపై గౌరవం ఉందని, కేసు కోర్టులో ఉన్నందున ఇప్పుడేమీ మాట్లాడనని అన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఫైరింగ్‌లో శిక్షణ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రెయిన్‌బో పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణలో గురువారం డ్రిల్, ఫైరింగ్‌పై ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా 24 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డీ కరంచంద్ మాట్లాడుతూ క్యాడెట్స్ అందరూ నిబద్ధతతో శిక్షణ పొందాలని, ఈ శిక్షణ ద్వారా భారత సైనికులుగా, ఉత్తమ పౌరులు గా దేశానికి సేవలందించేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. అనంతరం మ్యాప్ రీడింగ్, చరిత్ర మీద తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ హేమంత్‌కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్లు సమాల్, రాజ్‌పాల్, ఎన్‌సీసీ అధికారులు మస్తాన్‌వలీ, శ్రీపతి ప్రసాద్, జయరాం, జావీద్, బాషా, దీప్తి పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

ఇంటర్ పరీక్ష ఫీజులు సకాలంలో చెల్లించాలి : ఆర్ఐవో

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులు వచ్చే ఏడాది జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజులను సకాలంలో చెల్లించాలని ఆర్ఐవో టీ వరప్రసాద్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు అక్టోబరు 10వతేదీలోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. ఆ తర్వాత వెయ్యి రూపాయల అపరాధ రు సుముతో అక్టోబరు 21వతేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఫీజులు చె ల్లించేలా కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలని కోరారు. ఏకారణం చేతనైనా విద్యార్థుల నుంచి ఫీజు కట్టించుకోకున్నా, తమకు ఫిర్యాదులు అందినా వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కానిస్టేబుల్ శస్త్రచికిత్సకు సహచరుల ఆర్థిక సాయం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌కు ఆయన బ్యాచ్‌కు చెందిన సహచర కానిస్టేబుళ్లు, అధికారులు ఆర్థిక సాయం చేశారు. టీపీ గూడూరు మండలానికి చెందిన పీ నవీన్‌కుమార్ నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ నెల 11వ తేదీన విధులకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రెండు కాళ్లు విరిగిపోయి అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్‌కు 2009 బ్యాచ్ కానిస్టేబుళ్లు, సీఐలు సుబ్బారావు, అంకమరావు తదితరులు రూ.1,73,600 నగదు అందించారు. కానిస్టేబుల్ జీ మస్తాన్, షేక్ గౌస్ బాషా, జీ వేణులు గురువారం అపోలో వైద్యశాలలో నవీన్‌కుమార్ తల్లికి నగదు అందజేశారు.

ఫ్యామిలీ డాబాలో హిజ్రాల వీరంగం

● ఆలస్యంగా వెలుగులోకి ● పలువురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ఫ్యామిలీ దాబాలో దసరా మాముళ్ల కోసం హిజ్రాలు వీరంగం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు మినీబైపాస్ రోడ్డు పక్కన శ్రీహరి నగర్ వద్ద శ్రీవెంగమాంబ పంజాబీ ఫ్యామిలీ దాబా ఉంది. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 13 మంది హిజ్రాలు దాబాకు వెళ్లారు. దసరా మాముళ్లు ఇవ్వాలని మేనేజర్ హేమంత్‌ను డిమాండ్ చేశారు. ఆయన తమ యజమాని లేడని చెప్పడంతో హిజ్రాలు దౌర్జన్యానికి దిగారు. వెంటనే యజమానికి ఫోన్‌చేసి పిలవాలంటూ హంగామా సృష్టించి సిబ్బందిపై దాడి చేశారు. ఆ సమయంలో భోజనం చేస్తున్న కస్టమర్లు హిజ్రాల వెకిలి చేష్టలకు దాబా నుంచి వెళ్లిపోయారు. యజమాని సూచనలతో మేనేజర్ హేమంత్ బుధవారం రాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా దౌర్జన్యం, దాడికి పాల్పడిన హిజ్రాలు సల్మ, సిరి, రవి, మాలిని, హైమ, సుకన్య, సమీర, మయూరమ్మ, హీన, మానస, దేవి, హంస, బంగారమ్మగా గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేశారు. దసర పండుగ సందర్భంగా ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,880
వెండి కిలో ధర	రూ. 1,41,200
వెండి ఒక గ్రాము	రూ.144.00

వెలగని వీధి దీపాలు : పట్టించుకోని అధికారులు

కావలి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఇందిరమ్మకాలనీ లో వీధి దీపాలు వెలగక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఆరువేల కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఎక్కడ చూసినా వెలగని వీధి దీపాలే దర్శనమిస్తున్నాయి. వీధి లైట్లు వెలగక పోవటంతో రాత్రిపూట విషసర్పాల సంచారంతో ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి వీధి దీపాలకు గుర్తించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

జాతికి జీవం జానపదం!

కందుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని ప్రతీ జాతికి తనదైన ఒక సంస్కృతి ఉంటుందని, జానపదమే జాతికి జీవమని టీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మహిళా సాధికారత విభాగం, సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగ కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూ ఒకప్పుడు దసరా, శ్రీరామనవమి పండుగల సందర్భంగా కోలాటం, పగటి వేషాలు, తప్పెటగుళ్ల వంటి జానపద కళారూపాలను విశేషంగా ప్రదర్శించేవాళ్లని గుర్తు చేశారు. విద్యార్థినుల కోలాట ప్రవర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు, ఐక్యూ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పీ రాజగోపాలబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ అనూష, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

అల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎడగారు పూర్తిచేసుకున్న క్రమంలో రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకునే సమయం కావడంతో జీలుగ విత్తనాలను సిద్ధంగా ఉంచామని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలలో తెలిపారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద ఈ విత్తనాలను సిద్ధంగా ఉంచామని, 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఈ విత్తనాలను తీసుకొని పచ్చిరొట్ట పైరులను వేసుకోవాలని ఆయన సూచించారు.

శ్రమదానం చేద్దాం పరిసరాలను శుభ్రపరుచుకుందాం !

అల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఒక్కరూ శ్రమదానం చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని గురువారం అల్లూరులోని ఆర్‌డిఆర్ కాలనీలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లు శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీడీవో వరప్రసాద్, స్థానిక నాయకులు షేక్ నజీర్ బాషా, పాశం దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

విట్స్‌లో ..

కావలి (టౌన్),(ఆంధ్రజ్యోతి):విట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు.

కనుల పండువగా నవరాత్రోత్సవాలు


బిట్రగుంట : కాత్యాయనిదేవి అవతారంలో దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి


కావలిటౌన్ : కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి


కలిగిరి : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కొండాపురం : అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

కావలి (టౌన్) సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రోత్సవాలు నాల్గవ రోజు గురువారం కనుల పండువగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు మహాగౌరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చి రాత్రి చిలుక వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు భువనేశ్వరీదేవి అలంకారంలో కొత్తబజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు కాత్యాయినీ దేవి అలకారంలో దర్శనమివ్వగా ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విష్ణాలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు కాత్యాయినీ దేవి అలకారంలో దర్శనమిచ్చారు.

● బృందావనం కాలనీలో వున్న శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారికి చిన్నశేష, హంస వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీవారికి చిన్నశేష వాహన సేవ, రాత్రి హంస వాహన సేవలందించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామివారికి ఉదయం సింహ వాహన ఉత్సవం, రాత్రి ముత్యపు వాహన ఉత్సవం జరగనున్నాయి.

బిట్రగుంట : బోగోలు మండల ఆలయాలలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబల్లి శ్రీనివాసులు విజయలక్ష్మీ, సాధు శ్రీనివాసులు, దుర్గావతి దంపతులు పాల్గొన్నారు. బోగోలు షిర్డిసాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాలలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించారు.

కలిగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు గురువారం భక్తులకు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చనలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద పూజా కార్యక్రమంలో ఉంచిన నోటుపుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంచిపెట్టారు. గోనె వెంకటకృష్ణయ్య-ఆదెమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలోని గంగమ్మ గుడివద్ద దేవీ నవరాత్రులను పురస్కరించుకొని అమ్మవారికి గురువారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించి కుంకుమపూజ తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందచేశారు.

కందుకూరు : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంకమ్మతల్లి కాత్యాయనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతం అభిషేకం, కుంకుమ పూజ అష్టోత్తరం, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

కావలి (టౌన్) సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ 2వ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వెంగళరావునగర్ పీహెచ్‌సీ ఆవరణలో పార్టీ అధ్యక్షుడు లక్కరాజు భాస్కర్ అధ్యక్షతన దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బీజేపీ నేతలు మురళి, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం, సన్నిగంటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

●ఒకటవ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంద కిరణ్ అధ్యక్షతన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరత్, బెల్లంకొండ మాల్యాద్రి, బ్రహ్మానందం, కమల, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●రూరల్ కమిటీ ఆధ్వర్యంలో

పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా కావలి రూరల్‌మండల బీజేపీ అధ్యక్షుడు జరుగుమల్లి జయకుమార్ ఆధ్వర్యంలో కావలి ఏరియావైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కంచర్ల మురళీ, ఎం. అనిత, బీ. మాల్యాద్రి, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం, వీ. జయరామిరెడ్డి, పీ. క్రాంతికుమార్, ఏ. మురళీ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండల బీజేపీ అధ్యక్షుడు వీరాల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎన్. శ్రీనివాసులు యాదవ్, జీ వెంకటేశ్వర్లు, పీ.గోవిందరాజులు, పీ.సూర్యం, డీ.మాల్యాద్రి, ఎన్.జ్యోతి, ఎస్.యామిని పాల్గొన్నారు.

కొండాపురం : పండిట్ దీన్‌దయాళ్ జయంతిని కొండాపురం పీహెచ్‌సీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో బీజేపీ నేతలు ఓరుగంటి మాధవ్, మాలేపాటి మల్లికార్జున, చల్లా చినమాల కొండయ్య, సోమినేని రవీంద్ర, కొమ్మి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు స్థలాన్ని కబ్జా చేయటం దుర్మార్గం

● ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు


తహసీల్దారుతో చర్చిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జర్నలిస్టులు

కందుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డులో 1999లో జర్నలిస్టులకు ఇచ్చిన నివాస స్థలాలలో ఆంధ్రజ్యోతి విలేకరి కె. హరిబాబుకు చెందిన స్థలాన్ని దుర్గమ్మగుడి కమిటీ పేరిట కబ్జా చేయటం దుర్మార్గ చర్య' అని, అధికారులు వెంటనే కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం కబ్జాకు గురైన స్థలాన్ని ఐవీ సుబ్బారావు ఇతర జర్నలిస్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరి నిర్మించుకున్న ప్రహరీగోడను కూడా ధ్వంసం చేసి ఆనవాలు లేకుండా చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ముందస్తు వ్యూహంతో కబ్జా చేసిన వారు దేవాలయ కమిటీ పేరిట పలువురు మహిళలకు పూనకం వచ్చినట్లుగా హడావిడి చేశారు. స్థానికులు మాట్లాడుతూ దురాక్రమణ తప్పేనని, సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తే బాగుంటుందని ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులతో అన్నారు. అయితే దేవుడి పేరిట స్థలం దురాక్రమణ మంచి పద్ధతి కాదని సుబ్బారావు ఖండించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధుల బృందం కబ్జా విషయాన్ని కందుకూరు సీఐ అన్వర్‌బాషా, తహసీల్దారు లావణ్యల దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ పరిస్థితులను విచారించి బాధిత విలేకరికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టాలు అధికారికంగా దాఖలు చేసినవని గుర్తించామని, కబ్జాదారులపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులతో పాటు కందుకూరులోని జర్నలిస్టులంతా ఈ ఘటనను ముక్తంకంఠంతో ఖండిస్తూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఏ సురేష్, దాసరి కనకయ్య, వెంకటరావు, రాంబాబు, స్థానిక జర్నలిస్టులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మ ఆశయాలు కొనసాగిద్దాం


మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

కావలి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఆశయాలు కొనసాగిద్దాం.. అని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మాగుంట పార్వతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట కుటుంబం ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆమె కావలి నియోజకవర్గానికి అందించిన సేవలు, అభివృద్ధిని గుర్తించి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జీ. కిషోర్, జ్యోతిబాబూరావు, జీ. రాజకుమార్‌చౌదరి, జే. మహేంద్ర యాదవ్, అయేషా కే. భాస్కరరెడ్డి, దావులూరి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ వద్దంటూ నిరసన

కావలి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామమూర్తిపేటలో సత్యనారాయణగుడి సమీపంలో ఏర్పాటు చేస్తున్న బార్‌అండ్‌రెస్టారెంట్‌కు వ్యతిరేకంగా కావలిపట్టణంలో ఉమన్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతవాసులు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం, బ్యాంకులు, విద్యాసంస్థల చుట్టూ నివాసాలు ఉండే ఈ ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే ప్రశాంతతకు విఘాతం కలుగుతుందని అధికారులకు పలు పర్యాయాలు విన్నవించినా రెస్టారెంట్ నిర్మాణం ఆగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి, నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, శివపార్వతి, అందే రామయ్య, పెసల కృష్ణ, సింగవరపు సురేంద్రరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి : జేవీవీ

ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని గురువారం జేవీవీ నాయకులు ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే పేదలు, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్య గగనంగా మారతుందన్నారు. అనంతరం ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మల్లికార్జున, సందాని, సాదిక్ హుస్సేన్, ముజీబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సభ్యత్వ నమోదు

వింజమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏపీ ఎన్జీవో వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు సభ్యత్వ నమోదుచేశారు. తొలుత ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డికి సభ్యత్వాన్ని నమోదు చేశారు. నవంబర్‌లో జరిగే ఏపీ ఎన్జీవో ఎన్నికల కోసం సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వింజమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

నేత్రానందంగా కాత్యాయనిదేవి అలంకారం

ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తజనం


ఉదయగిరి : కాత్యాయనిదేవి అలంకరణలో పార్వతీదేవి


వరికుంటపాడు : కాత్యాయనిదేవి అలంకరణలో నాగరప్పమ్మ


సీతారామపురం : కాత్యాయనిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


తూర్పురొంపిదొడ్ల : కుష్మాండ దుర్గాదేవి అలంకరణలో మానసాదేవి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాత్యాయనిదేవి అలంకరణలో అమ్మవారు కనువిందు చేశారు. వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు కాత్యాయనిదేవి అలంకరణలో, తూర్పురొంపిదొడ్లలో మానసాదేవి అమ్మవారు కుష్మాండ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●ఉదయగిరి: పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీ నగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు కాత్యాయినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

●సంగం : స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో గురువారం రాత్రి కాత్యాయనిదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

●సీతారామపురం: మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం, గ్రామ దేవత అంకాలమ్మ గుడి, నారాయణమ్మపేటలో విజయకనకదుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు శ్రీకాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు గురువారం దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, సహస్ర దీపాకాలంకరణ, అర్చన అభిషేకాలు నిర్వహించారు. అంకాలమ్మగుడి వద్ద ఓంకారం నాగేశ్వరరావు,సుజాత దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


ఉదయగిరి: రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఉదయగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ శిబిరంలో అధికారులు, బీజేపీ కార్యకర్తలు, యువత అధికసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు వీ విజయలక్ష్మీ, సొసైటీ అధ్యక్షుడు చుండి హరిగోపాల్ రెడ్డి, తహసీల్దారు ఎల్ రామ్మోహన్, వైద్యాధికారి శివకల్పన, పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ, బీజేపీ నాయకులు నారాయణ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సురేష్, శ్రీహరి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలో బీజేపి మండల అధ్యక్షుడు గుండాల విజయబాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బీజేపి అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు భరత్‌రెడ్డి, శివారెడ్డి, జగ్గారెడ్డి, కోటీశ్వరరెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

వింజమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య ఈసీ సమావేశం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏపీఎం సుధాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే అధిక రుణాలు ఇచ్చేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు సునీత, సుశీల, లక్ష్మీకుమారి, విజయమ్మ, ఎఫ్‌బీఓపీ ఆదిలక్ష్మీ, అకౌంటెంట్ సువార్తమ్మ, సంఘబంధ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి


ఉదయగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజరు నజీర్

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గండిపాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు షేక్ నజీర్ అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తమవంతు బాధ్యతగా చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని శుభ్రతకు శ్రీకారం చుట్టాలని కోరారు. అనంతరం పలు దుకాణాలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని శుభ్రంచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు పీ నవ్య, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ సుధీర్, క్యాషియర్ సందానీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : సీడీపీవో


ఆత్మకూరు: రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో గోడపత్రికలను ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలని ఆత్మకూరు సీడీపీవో పి సునీలత సూచించారు. గురువారం మండలంలోని వాశిలిలో సర్పంచ్ చెలిక రమాదేవి ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా అధిక పోషకాలు ఉండే కూరగాయాలు, ఆకుకూరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: స్థానిక రైతుభరోసా కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రుగ్మతలతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పుణ్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, వైద్యఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●సంగం: స్థానిక సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ అశోక్ ప్రారంభించి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీయస్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే పిండి వంటలను ప్రదర్శించారు.

●ఏఎస్ పేట: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని టీడీపీ నాయకుడు మాల్యాద్రి నాయుడు సూచించారు. గురువారం ఆయన కావలి ఎడవల్లి గ్రామంలో చిరమన పీహెచ్‌సీ వైద్యులు డా జ్యోతిరాణి, నాగవినూత్న ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పలు వ్యాధులకు సంబంధించి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ కె సుబ్బలక్ష్మి, హెచ్‌ఈవో షఫీ, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

●వింజమూరు: సచివాలయం-5 పరిధిలో గురువారం వైద్య, ఆరోగ్య సిబ్బంది స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలతో వైద్య ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్యాధికారి మురళీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలకు వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం, వైద్య శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌ఓ సక్కు బాయి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, లీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సునీత, జానకి, ఉష, విజయలక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, ఎఫ్‌డీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లేగుంటపాడులో రక్తదాన శిబిరం

కోవూరు, సెప్టెంబరు,25 (ఆంధ్రజ్యోతి): లేగుంటపాడు గ్రామంలో గురువారం పవన్ కళ్యాణ్ సినిమా 'ఓజీ' రిలీజ్ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. సామాజిక సేవా కార్య క్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలనే లక్ష్యం తో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సింగం శెట్టి శ్రీరామ్, శ్రీపతి రాము, హరిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10880
వెండి కిలో ధర	రూ. 1,41,200
వెండి ఒక గ్రాము	రూ. 144.00

పోలీస్ స్టేషన్‌లో పురుగు మందు తాగిన టీడీపీ కార్యకర్త!


మస్తానయ్యను నెల్లూరు జీజీహెచ్‌కి తరలిస్తున్న 108 సిబ్బంది

వెంకటాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి) : కొందరు వైసీపీ కార్యకర్తలు ఇటీవల టీడీపీలో చేరి తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఓ టీడీపీ కార్యకర్త వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పూడిపర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తుంగా మస్తానయ్య ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మస్తానయ్య కుటుంబమంతా టీడీపీ సానుభూతుపరులే. గత సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డి గెలుపు కోసం బాధితుడు తీవ్రంగా కష్టపడ్డాడు. గత వైసీపీ హయాంలో కొందరు వైసీపీ నేతలు, కార్యకర్తలు తనపై దాడి చేశారని, తనను ఆటో నడుపు కోకుండా చేశారన్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత కొద్ది రోజులకు వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల తనను ఇబ్బందులకు గురిచేస్తూ తనపై దాడి చేశారని, ఆ సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే రాజీ చేశారే తప్ప తనకు ఎలాంటి న్యాయం చేయలేదని వాపోయాడు. వినాయక చవితి ఉత్సవాల్లో తనపై మాకు మ్ముడిగా దాడి చేశారన్నారు. గురువారం ఉదయం తాను ఇంట్లో ఉండ గా కొందరు దౌర్జన్యంగా ప్రవేశించి దాడి చేశారన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మస్తానయ్య పోలీసులు తనకు సరైన న్యాయం చేయడం లేదన్న బాధతో వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. వెంటనే పోలీసులు వెంకటాచలం సామాజిక వైద్యఆరోగ్య కేంద్రా నికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సరైన న్యాయం చేయక పోతే ప్రాణాలు తీసుకోవడానికైనా తాను సిద్ధమని బాధి తుడు తెలిపారు. సీఐ సుబ్బారావును వివరణ కోరగా పోలీస్ స్టేషన్‌లో పురుగు మందు తాగలేదని, ముందే శరీరానికి పూసుకుని వచ్చినట్లుగా ఉందన్నారు. మద్యం కూడా సేవించినట్లు ఉన్నాడని, విచారించి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ బీమా పథకాలను ప్రజలు, ఖాతాదారులు ఉపయో గించుకోవాలని నాబార్డు జిల్లా మేనేజర్ బాబు, లీడ్ జిల్లా మేనేజర్ మణిశేఖర్ లు అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పొదలకూరు శాఖ ఆవరణంలో బ్యాంకు ఖాతాదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన. అటల్ పించన్ల యోజన పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ సరిత, కన్వీనర్లు రవిశంకర్, గురుస్వామి, బ్రాంచ్ మేనేజర్ భగవాన్, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్నీ అక్రమ కేసులే!

● అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నీ అక్రమ కేసులేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ తన మీద 18 అక్రమ కేసులు పెట్టారన్నారు. 57 మంది అమాయకులపై అక్రమ కేసులు పెట్టి నెలల తరబడి జైళ్లలో ఉంచారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని కోడూరులో 16 ఎకరాల రొయ్యల గుంతలను ధ్వంసం చేసి రూ. కోట్ల విలువైన సంపదను సముద్రం పాలు చేశారన్నారు. పొదలకూరులో 14 మంది అమాయక ఆర్యవైశ్యులను అక్రమ కేసులతో జైలుకు పంపారన్నారు. సాగునీటి పైపులైన్లను పగులగొట్టించి 18 ఎకరాల సంపంగి పూల తోటలను బీడు పెట్టించారన్నారు. ఉదయగిరి నారాయణ లాకప్ డెత్‌ను ఆత్మహత్యగా మార్చిన ఘటనపై సిట్ విచారణ జరిపిం చాలని కోరుతున్నామన్నారు.

పార్లపల్లి సొసైటీ అభివృద్ధికి కృషి

విడవలూరు, సెప్టెంబరు, 25 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లి సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు వేగూరు చంద్రారెడ్డి అన్నారు. సొసైటీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో సొసైటీ పరిధిలోని రైతులకు సేవలందిస్తామన్నారు. రబీలో యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.జనార్ధనరెడ్డి, రామసుబ్బారెడ్డి, కామే శ్వర మ్మ, యేసోబు పాల్గొన్నారు.

'మధుకైటభ వధ' అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం కామాక్షి తాయి 'మధుకైటభవధ' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నెల్లూరు దోనిపర్తి నరసింహారావు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్రతీ ఇంటి ముందు ఓ మొక్క నాటాలి


రోడ్డు శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి ముందు ఒక మొక్క నాటి పర్యవరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కోరారు. గురువారం నగర కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యం లో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రోడ్లను శుభ్రం చేశారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'లోక్ కళ్యాణ్ మేళా'ను సద్వినియోగం చేసుకోవాలి

'లోక్ కళ్యాణ్ మేళా'ను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం బుచ్చి పురపాలక సంఘం కార్యాలయంలో 'లోక్ కళ్యాణ్ మేళా' నిర్వహించారు. కెనరా బ్యాంకు మేనేజర్ రాజు, డీఆర్పీ వేంకటేశ్వర్లు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు అంకయ్య, ఆర్గనైజర్ నర్మద, మహేంద్ర ఆర్‌పీలు పాల్గొన్నారు.

శ్రీవారికి స్వాతి నక్షత్ర వేడుకలు

రాపూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలోని స్వామి వా రి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు జరిపి, అనంతరం చందనాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేద పండితుల మధ్య శాంతి హోమం కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఈశ్వరీం... ఈశ్వరాణాం!


బాలాత్రిపుర సుందరిగా భువనేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు గురువారం మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారికి బాలత్రిపుర సుందరి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. నవావరణ పూజ, చండీ హోమం జరిగాయి. గ్రామదేవత ఇరగాళమ్మకు భవానీ అలంకారం జరిగింది. సామూహిక కుంకుమ పూజకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మూలాపేట ధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదీ దేవికి త్రిపుర సుందరీ అలంకారం జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబకు రాజరాజేశ్వరి అలంకారం జరిగింది. బాలాజీనగర్ సీతారామమందిరంలో సీతాదేవికి మీనాక్షి అలంకారం, ధనలక్ష్మీ హోమం జరిగాయి. కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో చండీ అలంకారం, నవాబుపేట శ్రీకృష్ణధర్మ రాజులు

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

స్వామి ఆలయంలో ద్రౌపదీదేవి అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పప్పులవీధిలో మహాలక్ష్మీ అమ్మ వారికి గాయత్రిదేవీ అలంకారం, సిద్ధి విఘ్నేశ్వరాలయంలో ధనలక్ష్మీ అలంకారం, అయ్యప్ప గుడిలోని గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో మహాలక్ష్మీకి గోదాలక్ష్మీ అలంకా రం జరిగాయి. వేదగిరి క్షేత్రం లో ఆదిలక్ష్మీ అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. నరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం కావడంతో తిరుప్పావడ సేవ నిర్వహించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెంకటప్రసాద్ రా.బాయిల్డ్ రైస్‌మిల్లు అధినేత వేముల ప్రసాద్, సుజాత, వేముల రామమూర్తి, దొరసాని, పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, శైలజ 1000 కేజీల స్వీట్లతో ప్రత్యేక అలంకారం చేయించారు.

'నారాయణ'లో ఏఐ సదస్సు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 5జీ నెట్‌వర్క్‌లలో ఏఐ వినియోగంపై సదస్సు నిర్వహించారు. అతిథిగా హాజరైన బీఎస్‌ఎన్‌ఎల్ డివిజనల్ ఇంజనీర్ జీ సుకుమార్ మాట్లాడుతూ 5జీ నెట్‌వర్క్ అభివృద్ధిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తోందని చెప్పారు. నెట్‌వర్క్ పనితీరును మెరుగుపరచడంలో, అంతరాయాలను గుర్తించడంలో, డేటా ట్రాఫిక్‌ను సమర్ధవంతంగా నిర్వహించడంలో ఏఐ ముఖ్య భూమిక పోషిస్తోందని తెలిపారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కాగా, కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని జీ సాయిలక్ష్మీ వాత్సల్య గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ కోహర్ట్ ఆర్గనైజర్‌గా ఎంపికైనందుకు యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఏ హజరత్తయ్య, హెచ్‌వోడీలు కే మురళి, సీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో హిమనికి డాక్టరేట్



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక సంస్థ ఉద్యోగి రాజారామ్ హిమని బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ సాధించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకత్వంలో స్టార్ ఆఫ్ ఇండియా పాలసీ అండ్ విమెన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేశారు. వార్డ్ విద్యా, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న తాను డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా హిమని తెలిపారు.

కొండాయపాళెం రైల్వేగేట్ వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మించాలి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెం రైల్వేగేటు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం 21, 22 డివిజన్ శాఖల ఆధ్వర్యంలో బాక్స్‌టైప్ బ్రిడ్జిపై సంతకాల సేకరణకు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనాభా, వాహనాల పెరుగుదల నేపథ్యంలో కొండాయపాళెం లెవల్ క్రాసింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మించాల్సి అవసరం ఉందన్నారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, పెంచల నరసయ్య, పోతురాజు శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలను ప్రజలకు అందించండి

● పెద్దబజారులో టీడీపీ నాయకుడు వినోద్ ప్రచారం

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపు ఫలాన్ని ప్రజలకు అందించాలని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి వ్యాపారుల ను కోరారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో గురువారం నగరంలోని పెద్ద బజారులో జీఎస్టీ 2.0పై వ్యాపారులు, ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

పోక్సో కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాలికను బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.20 వేల చొప్పున జరిమా నా విధిస్తూ పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పొదలకూరు బాలాజీగర్ ప్రాంతానికి చెందిన 10వ తరగతి బాలిక ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా అదే ప్రాం తానికి చెందిన లఘుసాని ప్రసాద్ బలవంతంగా తీసు కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతనికి భార్య లగుసాని గాయత్రి, కొంగర రవీంద్ర బాబు సహకరించారు. బాలిక తండ్రి ఫిర్యాదుతో పొదలకూరు పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా, ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.




సరస్వతి స్వరూపుడిగా భక్తులకు కటాక్షం

- రెండున్నర గంటల పాటు సాగిన వాహన సేవ

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మలయప్పస్వామి వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం జరిగిన చిన్నశేషవాహనంలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. గ్యాలరీలన్నీ ఖాళీగా కనిపించాయి. సాయంత్రానికి వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్న క్రమంలో రాత్రి హంస వాహన సమయంలో దక్షణ మాడవీధి మినహా మిగిలిన గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో వాహనాన్ని నెమ్మదిగా కదిలిస్తూ గ్యాలరీల్లోని భక్తులకు సంతృప్తికరమైన దర్శనాన్ని కల్పించారు. దీనివల్ల అరగంట ఆలస్యంగా.. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు వాహన సేవ సాగింది. వీఐపీలు తిరుగు ప్రయాణమైన క్రమంలో ట్రాఫిక్ ఆంక్షలను సడలించారు. రాత్రి వాహన సేవ ముందు వీఐపీల హడావుడి ఎక్కువ కాగా.. దీనిని తగ్గించాలంటూ భద్రతాధికారులను ఈవో సింఘాల్ ఆదేశించారు. ఈ వాహన సేవలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, నటి వాసూకీ, చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం: చిన్నశేష వాహనంపై గురువాయూరు శ్రీకృష్ణుడి అలంకారంలో మలయప్ప కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఏనుగులు, అశ్వాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవలు వైభవంగా జరిగాయి.



బ్రహ్మోత్సవాలలో నేడు | ఉదయం: 8-10 మధ్య సింహవాహనం | రాత్రి: 7-9 మధ్య ముత్యపుపందిరి వాహనం

గంటపాటు ఆలయంలో ఉపరాష్ట్రపతి, సీఎం


శ్రీవారి ఆలయంలో ఉప రాష్ట్రపతికి చిత్రపటం బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం గంటపాటు తిరుమల ఆలయంలో గడిపారు. ఉదయం 8.35 గంటలకు మహద్వారం నుంచి ఆలయప్రవేశం చేశారు. గర్భాలయంలోని శ్రీవారిని దర్శించుకుని 9 గంటలకు రంగనాయక మండపానికి చేరుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం తర్వాత 9.25 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. బయట వాహనాల వద్దకు వెళుతూ గ్యాలరీల్లోని భక్తులకు అభివాదం చేశారు. సమీపంలో ఉన్న కొందరు పిల్లలను సీఎం ఆప్యాయంగా పలకరించారు. వీరిద్దరు ఆలయం వెలుపలకు వచ్చే క్రమంలో కొద్ది సమయంలో అన్నదానం సమీపంలో వాహనాన్ని ఆపడంతో పాటు అక్కడక్కడ గేట్లు వేశారు. దీన్ని గమనించిన సీఎం వెంటనే గేట్లు తెరవాలని ఆదేశాలిచ్చారు. దీంతో వాహనసేవ యదావిధిగా ముందుకు సాగింది.


వాహనం వచ్చే క్రమంలో వేసిన గేట్లు గేట్లను తెరవాలని ఆదేశిస్తున్న సీఎం చంద్రబాబు - ప్రముఖులు రాకముందు నిర్మానుష్యంగా ఉన్న ఆలయ ప్రాంతం

వీవీఐపీల సందడి


ఉన్నతాధికారులు లేకుండా సాగుతున్న చిన్నశేషవాహనం

బ్రహ్మోత్సవాల ప్రారంభం సమయంలో తిరుమల మొత్తం వీవీఐపీలతో హడావుడిగా కనిపించింది. పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎంతో పాటు ఉపరాష్ట్రపతి, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఉండడంతో తిరుమల క్షేత్రం సైరన్లమోతతో మారుమోగింది. వీవీఐపీలు వెంట ఉన్నాతాధికారులు అంతా ఉండాల్సిరావడంతో గురువారం ఉదయం జరిగిన చిన్నశేషవాహన సేవలో చాలా మంది ఉన్నతాధికారులు పాల్గొనలేకపోయారు. ప్రారంభం, ముగింపులో మాత్రమే ఉన్నతాధికారులు కనిపించారు. వీఐపీల వల్ల అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు కూడా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రధానంగా రాంభగీచా, మినీషాపింగ్ కాంప్లెక్స్ వంటి ప్రాంతాల్లో ఈ సమస్యలు కనిపించాయి.

'అన్నా' ఇంట విషాదం

- చిలకలూరిపేట వద్ద ప్రమాదంలో అల్లుడు, మనవరాలి దుర్మరణం
- మరో ఐదుగురికి గాయాలు
- కార్పొరేటర్ అన్నా సంధ్య పరిస్థితి ఆందోళనకరం


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బీసీ నేత అన్నా రామచంద్రయ్య ఇంట విషాదం నెలకొంది. గుంటూరులో జరిగే బంధువుల ఫంక్షన్‌కు వెళ్తుండగా బుధవారం అర్ధరాత్రి 10.30 గంటలకు వీరి కారుకు చిలకలూరిపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రామచంద్రయ్య అల్లుడు డాక్టర్ వెంకటకిషోర్(42), మనవరాలు అశ్వినందన (4) మృతిచెందగా, మిగిలిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో కార్పొరేటర్ అన్నా సంధ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన తంగెళ్ల వెంకటకిషోర్ స్విమ్స్‌లో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఈయన అన్నా రామచంద్రయ్య పెద్ద కుమార్తె డాక్టర్ అన్నా సంధ్యను వివాహం చేసుకున్నారు. ఈమె కార్పొరేటర్. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని బాలాజీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్. వీరికి కుమారుడు ఆయుష్ నందన, కుమార్తె అశ్వినందన ఉన్నారు. గుంటూరులో ఫంక్షన్ కోసం ఈ నలుగురితో పాటు అన్నా రామచంద్రయ్య కోడలు డాక్టర్ శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా ఆధ్య(8), అన్నా మైరా కలిసి బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో మహేంద్ర ఎక్స్ యూవి 700 కారులో బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద వీరి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటకిషోర్ కారు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. తలపై బలమైన గాయాలైన చిన్నారి అశ్వినందనను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కారు ముందు సీట్లో ఉన్న కార్పొరేటర్ అన్నా సంధ్య కాళ్లకు తీవ్ర గాయాలవడంతో గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించినట్లు చిలకలూరిపేట ఎస్‌ఐ అనిల్‌కుమార్ చెప్పారు. మిగిలిన నలుగురికి చిలకలూరిపేటలోని ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి రేపల్లెలోని వెంకటకిషోర్ ఇంటికి తరలించారు. అక్కడే దహన సంస్కారాలు నిర్వహించనున్నారు. అతి వేగంతో పాటు నిద్రమత్తు వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో 'అన్నా' ఇంట విషాదచాయలు అలుముకున్నాయి. అన్నా రామచంద్రయ్య ఆయన కుటుంబ సభ్యులు చిలకలూరిపేటకు వెళ్లారు. ఇక, చిలకలూరిపేటలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం. కాగా, వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి కూడా తిరుపతి నుంచి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించారు.


మృతి చెందిన అశ్వినందన


డాక్టర్ వెంకటకిషోర్ (ఫైల్ ఫొటో)

నాన్నంటే ప్రేమ: నాలుగేళ్ల అశ్వినందనకు నాన్న వెంకట కిషోర్ అంటే విపరీతమైన ప్రేమ అని కుటుంబీకులు చెబుతున్నారు. అతడిని వదిలి ఉండేది కాదని.. మృత్యువులోనూ ఆయన వెంటే వెళ్లిందంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రూ.5 లక్షల టపాకాయలు సీజ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శివకాశి నుంచి కొరియర్ ద్వారా అక్రమంగా తెప్పించిన రూ.5 లక్షల టపాకాయలను గురువారం తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీసులు సీజ్ చేశారు. జీఎస్టీ చెల్లించకుండా రెండు నెలలుగా కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు ద్వారా 27 బాక్సులు తెప్పించారని అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంకు అందిన సమాచారం మేరకు ఈస్ట్, అలిపిరి సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది దాడి చేసి సీజ్ చేశారు. అనుమతుల్లేకుండా.. భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాకాయలు నిల్వ ఉంచిన ఆ రవాణా కంపెనీపై కేసు నమోదు చేశారు.


రాంకిషోర్, సురేంద్రను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

వీఎస్వోలూ వెల్‌డన్

ప్రపంచ పోలీస్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను సీఎం చంద్రబాబు అభినందించారు. బర్మింగ్‌హామ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025లో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర స్వర్ణ, కాంస్య పతకాలను సాధించారు. వీరు గురువారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాన్ని వివరించారు. వీరిద్దరినీ చంద్రబాబు అభినందిస్తూ పట్టువస్త్రంతో సత్కరించారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆనందోత్సాహాలు

1529మంది టీచర్లకు నియామక పత్రాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 1529మంది టీచర్లు గురువారం నియామక పత్రాలు అందుకున్నారు.విజయవాడలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వీరు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.వీరితో పాటు సహాయకులు, అధికారులు 3368మంది జిల్లానుంచి హాజరయ్యారు.

భారతీయ జ్ఞాన పరంపరను కాపాడుకోవాలి

- సంస్కృత వర్సిటీ ఛాన్సలర్ గోపాలస్వామి


ఐకేఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛాన్సలర్ గోపాలస్వామి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ జ్ఞాన పరంపరను కాపాడుకోవాలని జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్. గోపాలస్వామి పేర్కొన్నారు. సంస్కృత యూనివర్సిటీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఐకేఎస్) కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. గోపాలస్వామి మాట్లాడుతూ యూనివర్సిటీలో ఐకేఎస్ కేంద్రం ఏర్పాటు మంచి పరిణామమని తెలిపారు. సంస్కృతంలోని ఎన్నో విజ్ఞానదాయక అంశాలను ఈ కేంద్రం ద్వారా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మాడగుల నాగఫణి శర్మ మాట్లాడుతూ అవధాన కళ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచుతుందన్నారు. దాని గురించి ఈ తరం తెలుసుకోవాలని కోరారు. ఐకేఎస్ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి వీసీ కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఐకేఎస్ నేషనల్ కోఆర్డినేటర్ సూర్యనారాయణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, డీన్ రజనీకాంత్‌శుక్లా, ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ పాల్గొన్నారు.






శరన్నవరాత్రుల అలంకరణలు

తిరుపతి: అన్నపూర్ణాదేవిగా తాతయ్యగుంట గంగమ్మ

చిల్లకూరు: మోహినీదేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ

సూళ్లూరుపేట: అష్టకాళి అలంకారంలో చెంగాళమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి: ప్రత్యక్షం అవతారంలో జ్ఞానప్రసూనాంబ

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 8 గంటల పనివిధానాన్నే కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, సునీల్, మీరాభాయి, శ్రీనివాసులు, మోహన్ పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: కార్మికుల పని గంటలు పెంచడం గర్హనీయమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, మునీంద్ర, కందప్ప, రాజేష్, నరేష్, వేణు, మురళి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మ్యాపింగ్‌తో ఆస్తిపై హక్కు



స్వామిత్వ రీసర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

గూడూరు, సెప్టెం బరు 25 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ మ్యాపింగ్ వలన గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సులభతరం అవుతుందని తిరుపతి పార్లమెంటు టీడీపీ రైతుకమిటీ కార్యదర్శి దుద్దా రాఘవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో స్వామిత్ర రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ నత్తాల్లో నిర్మించిన గృహాలను గుర్తించి రీసర్వే నిర్వహించి వారికి డిజిటల్ ఆస్తి కార్డులను అందజేస్తామన్నారు.

మహిళల ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యం

చిల్లకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణ కోసమే స్వస్త్‌నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి అన్నారు. గురువారం మండలంలోని ఓడూరు గ్రామంలో స్వస్త్‌నారీ-సశక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. డాక్టర్ షాలోమ్‌అరాఫత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహబూబి, రేణుకమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పేట రైల్వే స్టేషన్‌లో జోగ్బాలీ రైలు నిలుపుదల

నాయుడుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు ఈరోడ్డు నుంచి బీహార్‌లోని జోగ్బాలీ వరకు వెళ్లే జోగ్బాలీ ఎక్స్‌ప్రెస్ 16601 రైలును ప్రతి గురువారం నిలవనున్నట్లు స్టేషన్ మాస్టర్ తెలిపారు. తొలిసారి వచ్చిన రైలుకు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానం పలికారు. రైల్వే స్టేషన్ మాస్టర్ సాంబశివరావును, జోగ్బాలీ రైలు డ్రైవర్‌ను సన్మానించారు. కాగా జోగ్బాలీ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల కోసం కృషిచేసిన ఎంపీలు గురుమూర్తి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే విజయశ్రీలను సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అధ్యక్షుడు మస్తానయ్య, ఉపాధ్యక్షుడు ఆర్ రాఘవన్, కార్యదర్శి కంకిపాటి కిరణ్, సుల్తాన్, శంకర్‌లాల్ అభినందించారు.

చిల్లకూరు సొసైటీ అభివృద్ధికి కృషి

పెళ్లకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్లకూరు సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని చిల్లకూరు పీఏసీఎస్ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ అన్నారు. ఇటీవల చిల్లకూరు సొసైటీ త్రీమాన్ కమిటీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన గోపాల్ కృష్ణను కూటమి నాయకులు శ్రీనివాసులు, హరిప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ యాదవ్, ప్రసాద్‌రాజు తదితరులు గురువారం సత్కరించారు.

మోహినీదేవిగా ముత్యాలమ్మ

చిల్లకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం తూర్పుకనుపూరలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారిని మోహినీదేవి అలంకారంలో ఉంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముత్యాలమ్మను ఊరేగించారు. కలవకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని ధైర్యలక్ష్మిగా అలంకరించారు.

ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణలు

కోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలలో గురువారం రాత్రి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కోటలోని గ్రామదేవత కోటమ్మ అమ్మవారిని కాత్యాయనిదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరి బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. విద్యానగర్‌లో ఉన్న విద్యాగణపతి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. కల్లూరు రాజేంద్ర, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ర్వహించారు.

వెంకన్నపాళెంలో ఉచిత వైద్య శిబిరం

కోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకన్నపాళెంలో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాలలో భాగంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నాగరాజు వైద్యపరీక్షలు నిర్వహించారు.

టీటీడీ ఏఈవోకు ఎమ్మెల్యే దంపతుల పరామర్శ

డక్కిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆయన సతీమణి సింధు పరామర్శించారు. వెంకయ్య చౌదరి తండ్రి మృతి చెందడంతో మాచర్ల నియోజకవర్గ పరిధిలోని బెల్లంకొండవారి పాళెం గ్రామానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

పేద బలిజలకు విద్య, వైద్య సేవలు అందిస్తాం

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద బలిజ విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసాయం అందించేలా ఆప్తా (అమెరికా) వారి సాయంతో ఆదుకుంటామని ఆ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. గురువారం స్థానిక రాజావీధిలోని బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధుల కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు.

సకాలంలో ఆదాయపన్ను చెల్లించాలి

గూడూరు: వ్యాపారులు సకాలంలో ఆదాయ పన్ను చెల్లించాలని ఆదాయపన్నుశాఖ అధికారి ఆశిష్‌కుమార్ కోరారు. స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం ఆదాయపన్నుశాఖ ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి: బీజేపీ

పెళ్లకూరు: ప్రధాని మోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసర ధరలతో పాటు ఇతర వస్తువులు ధరలు తగ్గి ప్రజలకు లబ్ధి చూకూరిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం లోని శిరసనంబేడు గ్రామంలోని సచివాలయంలో నిర్వహించిన స్వస్త్ నారీ - సశక్తి పరివార్ కార్యక్రమాన్ని డాక్టర్ జితేంద్రతో కలసి ప్రారంభించారు. వైద్య సిబ్బంది ద్రాక్షాయణి, రియాజ్, శంకు గీత, నాయకులు కేశవరెడ్డి, మురళి పాల్గొన్నారు.

కోటలో దీనదయాళ్ జయంతి

కోట: స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆపార్టీ వ్యవస్థాపకులు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గాయత్రీదేవిగా పార్వతీమాత

డక్కిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన దేవునివెల్లంపల్లి గ్రామంలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు గురువారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



పెళ్లకూరు: విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని చెంబడిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరికి చెందిర పన్నీరు సెల్వం (22) చెంబడిపాలెం గ్రామ దేవత కూటాలమ్మ ఉత్సవాలకు విద్యుత్‌దీపాల అలకరణ చేసే పనులకు వచ్చాడు. బుధవారం రాత్రి విద్యుత్‌షాక్ గురై మృతి చెందాడు. ఎస్‌ఐ నాగరాజు అతడి మృతదేహాన్ని నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు. పంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కిటకిటలాడిన ఆలయాలు



వాసవి కన్యకాపరమేశ్వరికి పద్మావతిదేవి అలంకారం- మూలవిరాట్‌కు కుబేర కుంకమ అలంకారం

వెంకటగిరిటౌన్, సెప్టెం బరు 25(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రిల్లో భాగంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో గురువారం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి పద్మావతి దేవి అలంకారం, మూలవిరాట్‌కు కుబేర కుంకమ, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యాయనీ దేవికి రాజరాజేశ్వరి దేవి అలంకారం, వెంకటేశ్వర స్వామికి నరసింహావతారం, మందనాంచారేశ్వరికి అన్నపూర్ణ దేవి అలకారం చేశారు. ముందుగా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షార్‌లో ఘనంగా సతీష్ ధావన్ జయంతి



సూళ్లూరుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): షార్‌లో గురువారం ప్రొఫెసర్ సతీష్‌ధావన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. షార్‌లోని 0 పాయింట్ వద్దనున్న ఆయన విగ్రహానికి షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్ ఆధ్వర్యంలో షార్ ఉద్యోగులు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా శ్రీహరికోటలోని ఎంసీసీ భవనం, సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ సమీపంలోని కేఆర్‌పాలెం సతీష్ ధావన్ మెమోరియల్ హాస్పిటల్‌లో షార్ విశ్రాంత ఉద్యోగులు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. షార్ కంట్రోలర్ జీ.రమేష్ పాల్గొన్నారు.

హాజరు వేయడం లేదని ఉపాధి కూలీల నిరసన

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హాజరు వేయడంలేదని మండలంలోని చిలమత్తూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు గురువారం పనుల వద్ద నిరసన తెలియజేశారు. అధికారులు కూలీల హాజరు నమోదు చేయించాలని కోరారు.

అష్టకాళిగా చెంగాళమ్మ



సారెను తీసుకెళ్తున్న భక్తులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు అష్టకాళి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి పుష్పాలంకరణ చేశారు. అనంతరం ఆలయ మహాచండీ యాగం వైభవంగా నిర్వహించారు. కోళ్లమిట్ట, రాజీవ్‌నగర్, ఇసుకమిట్ట ప్రాంతవాసులు అమ్మవారికి దసరా సారెను సమర్పించారు. సారెను తీసుకొచ్చిన భక్తులకు ఆలయ రాజగోపురం వద్ద సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి అలంకారానికి ముద్దాలి శరణ్‌కుమార్ రెడ్డి-లక్ష్మీప్రియ, చండీయాగానికి మాదరపాక జగన్మోహన్ రెడ్డి-గౌరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆదర్శప్రాయుడు దీనదయాల్



గూడూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ ప్రాయుడు పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ అని జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు అన్నారు. గురువారం స్థానిక నరసింగరావు పేటలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, ధనుంజయ, బాలకృష్ణ, రవీంద్ర బాబు, వెంకటేశ్వర్లు, బాలమణి, భార్గవ్, ఇంద్రవర్ధన్ పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకరణలో మూకాంబికాదేవి



నాయుడు పేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గాయాత్రిదేవి అలంకరణలో మూకాంబికాదేవి దర్శన మిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని మూకాంబికాదేవి, మానసాదేవి, గ్రామదేవత పోలేరమ్మ, దుర్గాదేవి, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిమ్మసాగులో మెలకువలపై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెట్లూరు వద్ద ఉన్న వైఎస్ఆర్ నిమ్మచీని పరిశోధన కేంద్రంలో తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిమ్మ, చీనీ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంసుందర్, ఉద్యానవన శాస్త్రవేత్త నాయక్ నిమ్మసాగులో మెలకువలపై గురువారం అవగాహన కల్పించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి 50మంది రైతులకు అవగాహన కల్పించారు.

అధిక దిగుబడి కోసం డ్రం సీడర్

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించడం కోసం డ్రంసీడర్‌ను వాడుకోవాలని కేవీకే ప్రిన్సిపాల్ రాజీవన అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు డ్రం సీడర్‌పై అవగాహన కల్పించారు. సిబ్బంది విజయశ్రీ, తిరుపాల్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



టిడ్కో గృహాల పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తవని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక టిడ్కో గృహాల వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్-సీసీపీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం సవారిగుంట ప్రాంతంలోని మహిళలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అంతకుముందు ర్యాలీ చేశారు.

ఏపీటీఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట పోలీసు స్టేషన్ ఎదురుగా గురువారం ఎపీటీఎఫ్ నూతన భవనానికి ఎపీటీఎఫ్ మండల ప్రధాన అధ్యక్షుడు అల్లెయ్య, ప్రధాన కార్యదర్శి మురళీ తదితరులు శంకుస్థాపన చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌బాబు, నరసింహరావు, రజనీ బాబు, దయాక రయ్య, తిరుపాలు, డాక్టర్ రాజేష్, వెంకటేశ్వర్లు, ఆనంద్, పరంధామయ్య, భువనేశ్వరి, శివప్రసాద్ పాల్గొన్నారు.

అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి

సూళ్లూరుపేట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అరవభూమి తులసి రెడ్డి- దివ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు.

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పలు ఆలయాల్లో గురువారం అమ్మవార్లను వివిధ అలంకరణలలో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవిని రజతకవచ అలంకారంలో, బజారుకలిశం వద్ద అమ్మవారిని గౌరీదేవి రూపంలో, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణలో, రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని కాత్యాయని దేవి అలంకరణలో, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మోహినీదేవిగా, ధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని శుంభనిశుంభవధ అలంకరణలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.



రజితకవచ అలంకారంలో విజయదుర్గాదేవి అమ్మవారు - అన్నపూర్ణాదేవి అలంకారంలో నారాయణమ్మ అమ్మవారు - కాత్యాయనిదేవి అలంకారంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారు